సాక్షి ఒడిశా

మంగళవారం । 10 । జూన్ । 2025

'వందేభారత్ కొరాపుట్ వరకు నడపాలి'



జయపురం: భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు వస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును అరకు వ్యాలీ మీదుగా కొరాపుట్‌కు నడపాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ పతి డిమాండ్ చేశారు. ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ మఝి, కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌లకు ఆదివారం విడివిడిగా లేఖలు పంపారు. భువనేశ్వర్-విశాఖపట్నం 444 కిలోమీటర్లు దూరం కాగా అక్కడి నుంచి కొరాపుట్‌కు నడిపితే మరో 215 కిలోమీటర్లు అదనంగా దూరం అవుతుందని ఆయన లేఖలో వెల్లడించారు. వందే భారత్ సమయ లిమిట్ 800 కిలోమీటర్లు అని, అయితే భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం-కొరాపుట్ వరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపితే కేవలం 659 కిలోమీటర్లు మాత్రమేనని ఆయన లేఖలో వెల్లడించారు. వందే భారత్ రైలు కొరాపుట్ వరకు నడిపితే బహుళ ఆదివాసీ ప్రాంతాలైన నందపూర్, లమతాపుట్, రైలు సౌకర్యాలు లేని నవరంగపూర్, మల్కన్‌గిరి జిల్లాల ప్రజలు నేరుగా కొరాపుట్ నుంచి భువనేశ్వర్‌కు వెళ్లగలరని తెలిపారు. అరకు వ్యాలీ మీదుగా నడిపితే సందర్శకులకు కూడా అనువుగా ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

కొలనార సమితిలో వినతుల స్వీకరణ



వినతులు వింటున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి సమావేశం హాల్‌లో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యవర్గ నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, ఏడీఎం పబ్లిక్ హెల్త్ మమత సాహు, ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ చంద్రకాంత్ మాఝి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 21 వినతులను కలెక్టర్ పట్వారి ప్రజల నుంచి స్వీకరించారు. ఇందులో 14 వ్యక్తిగతమైనవికాగా మరో ఐదు వినతులు గ్రామసమస్యలుగా గుర్తించి వీటిని సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఇద్దరి చికిత్స కోసం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 38 వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

మీనాజోలకు బస్ సేవలు ప్రారంభం



మీనాజోలకు ప్రారంభమైన బస్ వద్ద స్వామి జనకానంద గిరి తదితరులు

రాయగడ: జిల్లాలోని అత్యంత వెనుబడిన సమితిగా గుర్తింపు పొందిన మీనాజోలకు బస్ సేవలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పర్యాటక ప్రాంతమైన మీనాజోలలో ప్రముఖ పాతాలేశ్వర శైవక్షేత్రం ఉంది. ఇక్కడకు నిత్యం భక్తులు, పర్యాటకులు సందర్శిస్తుంటారు. అయితే సరైన రాకపోకలకు సంబంధించి బస్సు సౌకర్యాలు లేకపోవడంతో ఆటోలపైనే ఆధారపడేవారు. ఇటీవల జిల్లాలోని పర్యటించిన రాష్ట్ర రవాణా, వాణిజ్య, గనుల శాఖల మంత్రి బిభూతి భూషన్ జెన్న పర్యటించినప్పుడు మీనాజోల శైవక్షేత్రం వద్ద గల జనకల్యాణ ఆశ్రమానికి చెందిన స్వామి జనకా నంద గిరి సమస్యను మంత్రి దృష్టికి తీసకువెళ్లారు. స్పందించిన మంత్రి గుణుపూర్ వయా మీనాజోల వరకు బస్ సేవలు అందించాలని ఆర్‌టీవోకు ఆదేశించారు. దీంతో సోమవారం నుంచి ఇక్కడకు బస్ సేవలు ప్రారంభం కావడంతో మంత్రి జెన్నకు ధన్యవాదాలు తెలియజేశారు.

తమ్ముడిపై అన్న దాడి



ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రంలో ఛాతీలో దిగిన బాణంతో తిరుపతి ముదిలీ

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బోండఘాటీ పోల్లగూధ గ్రామంలో అన్నదమ్ములు భూతగాదాలో కొట్టుకున్నారు. అన్న హర ముదిలి కోపంతో తమ్ముడు తిరుపతిపై బాణంతో దాడి చేశాడు. ఛాతీపై బాణం దిగడంతో అతడిని వెంటనే ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్ తరలించారు. విషయంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన పిల్లలతో అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఈత శిక్షణ సోమవారంతో ముగిసింది. ఉత్తమశిక్షణ దారులకు బహుమతులు అందజేశారు. చెరువుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నిరోధించడానికి శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు కొరాపుట్ నుంచి 30 మంది వచ్చారని, ఏడు సమితులకు చెందిన 300మందికి ఈత నేర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ పాల్గొని విజేతల పిల్లలకు ప్రమాణ పత్రాలు అందజేశారు.

సెమల వంతెన.. నాణ్యత ఇంతేనా..?



గార్డ్ వాల్ నిర్మిస్తున్న దృశ్యం



నాణ్యత లేని పనులకు ఇది దర్పణం



వంతెనపై పనుల తీరు



సెమల వంతెన

జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి భనసులి పంచాయతీ సెమల గ్రామంలో రూ.3కోట్ల 83 లక్షల వ్యయంతో రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా నిర్మిస్తున్న వంతెన పనుల్లో అప్రోచ్ రోడ్డు పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనుల వద్ద కాంట్రాక్టర్ కానరావటం లేదంటున్నారు. నాణ్యతాహీనంగా పనులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దుయ్యబడుతున్నారు. వారానికి ఒక సారి సమితి కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి అధికారులు వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై విజిలెన్స్ దర్యాప్తు చేయాలని మాజీ సర్పంచ్ నరేంద్ర మఝి తో పాటు వార్డు సభ్యుడు త్రిపతి నాయిక్,తో పాటు కలియ నాయిక్,యాదవ నాయిక్,ధన్‌సింగ్ నాయిక్,సమురు పొరజ,లకుము సమరత్ తదితరులు కోరుతున్నారు. అయితే పనుల్లో అక్రమాలేవీ జరగలేదని జూనియర్ ఇంజినీర్ చెబుతున్నారు. జయపురం

భర్త చేతిలో భార్య హతం



హత్య జరిగిన గైబ గ్రామంలో పోలీసుల దర్యాప్తు



పరారీలో ఉన్న నిందితుడు నరేంద్ర పాయిక్



మోనికా మృతదేహం

పర్లాకిమిడి: అనుమానపు భూతం ఆవహించడంతో భర్త భార్యను హతమార్చిన సంఘటన గజపతి జిల్లా గుమ్మసమితి గైబ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ బ్లాక్ కెరడంగ గ్రామానికి చెందిన నరేంద్రపాయిక్ (31) 2019లో జి.మోనికాను (26) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఒడియా-తెలుగు కుటుంబాలకు చెందిన ఇద్దరు గుమ్మాబ్లాక్ గైబలో తమ మామగారి వద్ద కిరాణా షాపు పెట్టి నివస్తున్నారు. ఇంతలో నరేంద్రపాయిక్‌కు హైదరాబాద్‌లోని కమర్షియల్ మాల్‌లో ఉద్యోగం వచ్చింది. వీరికి ఐదేళ్ల పాప ఉంది. అమ్మవారి సంబరాల కోసం ఇటీవల స్వగ్రామానికి వచ్చిన నరేంద్ర మోనికాను హైదరాబాద్ తీసుకెళ్లాడు. ఇటీవలే గైబ గ్రామానికి వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆమెపై గొడ్డలిలో దాడి చేసి హతమార్చాడు. మెడలో ఉన్న రెండుతులాల బంగారం చైన్ లాక్కుని పారిపోయాడు. కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గైబ ఓ.ఐ.సి. రామకృష్ణదాస్, సెరంగో పీఎస్ అధికారి ప్రమోద్ ఖండువాల్, యస్.ఐ. కేదార్ పండా సంఘటనస్థలానికి వెళ్లి కేసు నమోదు చేశారు. నిందితుని కోసం సెరంగో పోలీసులు వెతుకుతున్నారు.

ఈపీఎఫ్ పింఛన్ రూ. పది వేలకు పెంచాలి



సమావేశంలో నళిణీ కాంత రథ్ తదితరులు

● అసోసియేషన్ నాయకుల డిమాండ్

జయపురం: తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పింఛన్‌దారుల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక యాదవ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు నళిణీకాంత రథ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. నళిణీ కాంత రథ్ మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు చుక్కలను తాకుతుండడంతో పింఛన్‌దారులు తమ కుటుంబ పోషణ దుర్భర మౌతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్ పింఛన్‌ను నెలకు రూ. తొమ్మిది వేలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదని వాపోయారు. అలాగే డీఏతో పాటు వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందమే అవుతోందన్నారు. డిమాండ్ల సాధనకు జరుపుతున్న ఆందోళనను ఇక ముందు కూడా సాగించాలని పిలుపు నిచ్చారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల సమయంలో దేశంలో 70 లక్షలకు పైగా ఉన్న ఈపీఎఫ్ పెన్షనర్ల డిమాండ్లను పార్లమెంట్‌లో ప్రస్తావించేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐడీయూసీ) సాధారణ కార్యదర్శి అమరజీత్ కౌర్, సీఐటీయూ కార్యదర్శి తపన్ సేన్, భారతీయ మజుదూర్ సంఘ్ (బీఎంఎస్) నేత గిరీష్ చంద్ర, ఐఎన్‌టీయూసీ నేత పి.కె.రాజులతో పాటు పలువురు నాయకులతో ఈపీఎఫ్ జాతీయ నేతలు చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఈపీఎఫ్ పింఛన్‌దారులు పనులు చేసే సమయంలో వారి జీతం నుంచి పీఎఫ్ కట్ చేసి జమ చేసేవారని.. అందులో కొంత శాతం ఖర్చు చేసినా వృద్ధాప్య సమయంలో వారి జీవనానికి మంచి పింఛన్ పొందేవారని అభిప్రాయపడ్డారు. వివిధ రాష్ట్రాలలో వృద్ధాప్య పింఛన్ మూడు వేల రూపాయల వరకు ఇస్తున్నాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం ఎక్కువ పింఛన్ లభిస్తుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఎస్.ఎస్.మూర్తి, అచ్యుత మాలీ, కేశవ చంద్రపండ, పి.గౌరీశంకర రావు, ఉమా రథ్, బసంత బెహర పాల్గొన్నారు.

రోగులకు సముచిత వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జయపురం: రోగులకు సముచిత వైద్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర అన్నారు. జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో నూతన అంబులెన్స్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో అంబులెన్స్ కొరత వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త అంబులెన్స్ రాకతో వారి కష్టాలు తీరుతాయని తెలిపారు. కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ ప్రజలకు ఉచిత వైద్య సౌకర్యం కోసం ఆయుష్మాన్‌భవ కార్డులు కూడా అందజేశారని తెలిపారు. అంబులెన్స్ ప్రారంభోత్సవంలో కమ్యూనిటీ హాస్పిటల్ అధికారి డాక్టర్ సారధీ ప్రసాద్ ముని, హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీవారు



గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లో గల కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామి వారు గజవాహనంపై తిరిగారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

యువకుని అనుమానాస్పద మృతి



చెట్టుకు వేలాడుతున్న యువకుని మృతదేహం

రాయగడ: ఒక యువకుని మృతదేహాన్ని మునిగుడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మామిడి చెట్టుకు వేలాడుతూ కనిపించిన మృతదేహాన్ని గుర్తించిన కొందరు సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. సంఘటన స్థలం వద్ద ఒక బైకును కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మృతుడు జిల్లాలోని తెరువలి ప్రాంతానికి చెందిన సంజయ్ కుమార్ దేవ్ (30)గా గుర్తించారు. మృతదేహాన్ని బట్టి ఇది హత్యాలేక ఆత్మహత్యా అన్న అనుమానాన్ని వ్యక్తం చేసిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రీయ క్రిస్టియన్ మోర్చా నిరసన



గజపతి రాష్ట్రీయ క్రిస్టియన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్‌కు వెళుతున్న రాష్ట్రీయ క్రిస్టియన్ మోర్చా నాయకులు

పర్లాకిమిడి: ఒడిశా రాష్ట్ర వ్యాప్తంగా క్రిస్టియన్లపై దాడులు, హింస జరుగుతున్నాయని వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని కోరుతూ రాష్ట్రీయ క్రిస్టియన్ మోర్చా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్రీయ క్రిస్టియన్ మోర్చా అధ్యక్షుడు ప్రమోద్ నిషాంత్ మాట్లాడుతూ, మణిపూర్‌లో క్రిస్టియన్స్‌పై దాడుల వల్ల 250 మంది మైనార్టీలు చనిపోయారని, 360 చర్చిలు ధ్వంసం అయ్యాయని, 70 వేల మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని భారత రాష్ట్రపతి పేరిట రాసిన వినతిని గజపతి కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ నిరసనలో అమోద్ కుమార్ బర్దన్, ఇంద్రమోహన్ నాయక్, ఇసాక్ బిశోయి తదితరులు ఉన్నారు.

ఘనంగా జానపద కళా సమ్మేళనం



వేదికపై అతిథులు



సమావేశానికి హాజరైన సంకీర్తన బృంద సభ్యులు



రోడ్లపై హరేకృష్ణ బృందం మహిళలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరిలో సోమవారం మహా సంకీర్తన, జానపద కళా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నగరం అంతటా హరేకృష్ణ హరేరామ నామ స్మరణ మార్మోగింది. ఒడిశా ప్రభుత్వ ఒడియా బాషా సాహిత్యం, సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు మల్కన్‌గిరి జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక జగన్నాథ్ మందిరం నుంచి సంకీర్తన బృందాలు బయల్దేరి స్థానిక మెయిన్ రోడ్డు మీదుగా డీఎన్‌కే క్రీడా మైదానం వరకు సాగాయి. ముగ్గురు జానపద కళాకారులను సత్కరించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్ర గౌడ్, జిల్లా ఎడిటర్ రామచంద్ర మాఝి, రాష్ట్ర సంకీర్తిన అధ్యక్షుడు నృసింగ్ చరణ్ సమంత్రయ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా కంచమ్మ తల్లి సంబరాలు



పూజలందుకుంటున్న కంచమ్మతల్లి నమూనా విగ్రహం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో నిర్వహిస్తున్న కంచమ్మ తల్లి గ్రామదేవత సంబర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 8వ రోజైన సోమవారం కూడా అమ్మవారిని సాయంత్రం తిరువీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని పీఠస్థానం నుంచి మఠం కంచిలి తీసుకొచ్చి, అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా జాతీయ రహదారి కూడలి వరకు ఊరేగించారు. ఆదివారం అర్ధ రాత్రి దాటిన వరకు జబర్దస్త్, ఢీ డ్యాన్స్ టీం యాక్టర్స్ అలరించారు.

శ్రీముఖలింగంలో పండిత సదస్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ మాసం నాల్గో రోజు సోమవారం అంకురార్పణ, హోమం, పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వారాహి అమ్మవారికి మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో నాగరాజు మృతదేహం

కవిటి: ఇచ్ఛాపురం పట్టణం ఉప్పలవీధికి చెందిన గేదెల నాగరాజు(32) అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఘటనకు సంబంధించి కవిటి ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంచిలిలో జరుగుతున్న అమ్మవారి పండుగల కోసం నాగరాజు మధ్యాహ్నం 1 గంటకు ఇచ్ఛాపురం నుంచి కంచిలి చేరుకున్నాడు. అక్కడ రోజంతా ఉండి రాత్రి 8 గంటలకు సొంతూరు ఇచ్ఛాపురానికి బయలుదేరాడు. ఈ తిరుగు ప్రయాణంలో కవిటి మండలం జాతీయ రహదారిలో సర్పంచ్ దాబా దాటిన తర్వాత జమేదారుపుట్టుగ జంక్షన్‌కు చేరుకునే సమయానికి బండి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబసభ్యులు ఘటన స్థలానికి వేకువజామున చేరుకున్నారు. మంగళవారం ఉదయం ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

'జిల్లా అభివృద్ధికి కార్యాచరణ'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి స్పష్టమైన దిశ, కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు సోమవారం విజయవాడలోని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ ద్వారా స్వర్ణాంధ్ర కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన చర్చలో కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మాట్లాడారు.

కేంద్రాస్పత్రిలో పనిచేయని లిఫ్ట్

టెక్కలిరూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిలో లిఫ్ట్ మూడు రోజులుగా పనిచేయడం లేదు. పై ఫ్లోర్‌లో డయాలసిస్ కేంద్రం ఉండడంతో మెట్లు ఎక్కి వెళ్లలేక కిడ్నీ వ్యాధి బాధితులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. మూడు రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

వినతుల వెల్లువ



పర్లాకిమిడి: ఆర్.ఉదయగిరి బ్లాక్ డబరగుడ గ్రీవెన్స్ సెల్‌కు హాజరైన ఎస్పీ జ్యోతింద్ర పండా, అధికారులు

పర్లాకిమిడి:

ఆర్.ఉదయగిరి బ్లాక్ డబరగుడ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, ఏడీఎం ఫల్గుణి మరియు, జిల్లా పరిషత్ ముఖ్య అభివృద్ధి అధికారి శంకర్ కెర్కెటా, తదితరులు హాజరయ్యారు. డబరగుడ, మహేంద్రగడ, చెలిగడ నుంచి 54 వినతులు అధికారులు స్వీకరించారు. వీటిలో 46 గ్రామ సమస్యలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిష్కరించారు. దివ్యాంగునికి ట్రైసైకిల్‌ను అధికారులు అందజేశారు. ఆర్.ఉదయగిరి బీడీఓ లారీమస్ ఖర్సల్, తహసీల్దార్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మహిళ, తదితరులు



మల్కన్‌గిరి: దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

బలిమెలలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్.ఎ.సి పురపాలక కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బలిమెల ఎన్.ఎ.సి పరిధిలో ఉన్న పలు పంచాయతీల నుంచి 32 వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులు ఏలా సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ కుమార్ సభరో, పోలీసు అధికారి, బలిమెల పురపాలక అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, ప్రభుత్వ ఉద్యోగులు హాజరయ్యారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



మాట్లాడుతున్న అతిథులు

జయపురం: జయపురంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సోమవారం సాయంత్రం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. స్థానిక అరవింద నగర్ విద్యామందిరం ప్రాంగణంలో నిర్వహించినన కార్యక్రమంలో పట్టణ ఆర్ఎస్ఎస్ ప్రతినిధి డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ అధ్యక్షత వహించారు. మహారాజ్ ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగిన రోజును హిందూ సామ్రాజ్య దినంగా రాష్ట్రీయ స్వయ సేవక్ సంఘం పాటిస్తున్నదని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ చంద్ర బెహర, ముఖ్యవక్తగా నవరంగపూర్ ఆర్ఎస్ఎస్ పట్టణ సంఘ సలక్ రాజేంద్ర కుమార్ భిశాయి, జయపురం పట్టణ సంఘ సలక్ ప్రేమానంద నాయిక్ పాల్గొన్నారు. సురేష్ నంద, అమృత బచన్ గంగాధర నాయిక్, ప్రధాన శిక్షకులు సుబ్రత పండలు దేశభక్తి గీతాలు ఆలపించారు.



పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పశువుల తరలింపు అడ్డగింత

నరసన్నపేట: ఒడిశాలోని కనుసు సంత నుంచి జాతీయ రహదారిపై అలమండకు అక్రమంగా తరలిస్తున్న గేదెల వ్యాన్‌ను నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో పాటు పెట్రోలింగ్ వాహన సిబ్బంది సంయుక్తంగా వాహనాన్ని అడ్డుకున్నా రు. సోమవారం వేకువజామున మడపాం టోల్‌గేట్ వద్ద తనిఖీల్లో వ్యాన్‌ను అడ్డుకుని అనుమతులు లేనట్టు గుర్తించారు. వ్యాన్‌లో 16 గేదెలు ఉండగా ఆరు గేదెలు చనిపోయి ఉన్నాయి. వెంటనే విశాఖ వద్ద గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

20న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 20వ తేదీన 118వ తపాలా అదాలత్ ఉంటుందని పోస్టుమాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్ కార్యాలయపు సహాయ సంచాలకులు కేవీడీ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 20వ తేదీ (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు పోస్టు మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఎంవీపీ బస్ కాంప్లెక్స్ పక్కన విశాఖపట్నంలో పోస్టుమాస్టర్ జనరల్ వారిచే 118వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ ఆదాలత్‌లో చర్చిస్తామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు జూన్ 16వ తేదీలోగా 118వ తపాలా అదాలత్ అను శీర్షికతో ' కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం 530017' అనే చిరునామాకు పంపాలని కోరారు. గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



క్రీడాకారులకు సూచనలు చేస్తున్న అథ్లెటిక్స్ సంఘ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు (వాసు), అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఎంపికలకు హాజరైన అథ్లెట్స్‌కు 100, 200, 400, 800, 1600 మీటర్ల పరుగు పందాలు, 5కేఎం వాక్, రన్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో వంటి అథ్లెటిక్స్ ఈవెంట్స్ జరిగాయి.

ఇక్కడ ఎంపికైన అథ్లెట్స్‌ను ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు పంపిస్తామని కొన్న మధుసూదనరావు పేర్కొన్నారు. తొలుత క్రీడాకారులకు ఎంపికల తీరుతెన్నులు, విధివిధానాలపై సంఘ నాయకులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, కె.హరిబాబు, కె.మాధవరావు, శ్రీనివాసరావు, పద్మలోచన, పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం(డిసెంబర్-3)కు గాను వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు, దివ్యాంగ సాధికారతకు కృషి చేస్తున్న సంస్థలకు, వ్యక్తులకు జాతీయ అవార్డులు ప్రదానం చేస్తారు.

ఈ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంస్థ ఏడీ కె.కవిత ఒక ప్రకటనతో తెలిపారు. అవార్డుల కోసం జూలై 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో www.awards.gov.inలో చేయాలని, దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్, అప్లికేషన్ కోసం www.depwd.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

గంజాయి బాబుల ఆగడాలు ఆపండి



ఎస్పీ కార్యాలయం ముందు ఐదు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, ఆయా గ్రామస్తులు

శ్రీకాకుళం క్రైమ్ : 'గంజాయి బాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మా గ్రామాలను ఆనుకొని ఉన్న తోటల్లో, పొలాల్లోని నిర్మానుష్య ప్రదేశాలే స్థావరాలుగా చేసుకుంటున్నారు. పేకాట శిబిరాలు సైతం నిర్వహిస్తున్నారు. ఎవరైనా రాత్రి పూట బయటకు వెళ్లాలన్నా.. బయటనుంచి ఊళ్లోకి రావాలన్నా.. రోడ్డు మీద ఎవరి మీద దాడి చేస్తారో.. ఏ ఒంటరి ఆడపిల్ల మీద అఘాయిత్యం చేస్తారోనని భయంగా ఉంది' అంటూ ఎచ్చెర్ల మండలంలోని ఐదు పంచాయతీల సర్పంచులు, ఓ ఎంపీటీసీ ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ధర్మవరం, పొన్నాడ, భగీరథపురం, ముద్దాడ, కొంగరాం గ్రామాల సర్పంచ్‌లు అల్లు కన్నబాబు, నేతింటి నీలం అప్పడు, నక్క కృష్ణమూర్తి, ముద్దాడ శంకరరావు, గుండ రవిలే కాక బొంతలకోడూరు ఎంపీటీసీ మాడుగుల జగదీష్‌లు, ఆయా గ్రామస్తులు ఎస్పీకి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో ఏముందంటే..

తమ గ్రామాల్లోకి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలు, బళ్లు, వ్యానులలో వచ్చి గ్రామంలో పడి దేవాలయాల్లో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు, పొలాల్లో మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాక్టర్లలో విలువైన పార్టులు, ఇళ్ల లో సామాన్లు, బంగారం, పాడి సంపదైన ఆవులు, గొర్రెలు, మేకలు ఎత్తుకుపోతున్నారని తెలిపారు. వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ధర్మవరంలో జగనన్న కాలనీలో మోటారును, శ్మశానంలో సర్వీసు వైరును ఎత్తుకుపోయారన్నారు. ఉగాది నాడు సింతు సత్యం అతని సోదరుడు ఇంట్లో సుమారు 12 తులాల బంగారం చోరీకి గురైందని ఇప్పటికీ జాడలేదని, పొన్నాడలో నాలుగు ట్రాక్టర్ల బ్యాటరీలు, ఓ ట్రాక్టర్ గేజ్‌వీల్స్, ముద్దాడ, భైరిపురం, ఎస్ఎంపురం గుళ్లల్లో ఆభరణాలు చోరీ చేశారన్నారు.

కొన్ని స్థావరాల్లో..

పొన్నాడ కస్తూర్బా స్కూలు సమీపంలోను, కొంగరాం-పొన్నాడ లింకురోడ్డు సమీపంలోను తోటలు, పొలాలను గంజాయి బాబులు స్థావరాలుగా మార్చుకున్నారని తెలిపారు. మత్తు పదార్థాలు సేవించిన అనంతరం పొన్నాడ బ్రిడ్జి లింకు తోటపాలెం రూట్‌లో వాణి పబ్లిక్ స్కూలు సమీపంలో ఓ కిల్లీ కొట్టు, నూడుల్స్‌కొట్టులో గడుపుతారని, బ్రిడ్జి దాటాక వరుసగా ఉన్న దాబాల్లో సైతం హల్‌చల్ చేసి రాత్రి 11 తర్వాత గ్రామాల్లో గ్రూపులుగా తిరుగుతారని విలేకరులతో అన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సర్పంచులతో పాటు జి.ఎర్రనాయుడు, నక్క జగదీష్, కరగాన గణేషు, ఎర్ర వైకుంట తదితరులున్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పట్వారి, ఖిముండొ

- రేపటి నుంచి సమితుల్లోకి వికాస్ వాహనం

రాయగడ: బీజేపీ అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలు శాఖల అధికారులలో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి సమీక్షించారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖిముండొ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నహాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 11 నుంచి జిల్లాలో గల 11 సమితుల్లో తిరిగేలా వికాస్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వాహనం అన్ని ప్రాంతాల్లో తిరిగి ఏడాదిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఆయా సమితుల్లో గల బీడీఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ వాహనాన్ని స్వాగతించి, ఆయా సమితి పరిధుల్లో తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వాహనం తిరిగే సమయంలో కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ, ఆధార్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయడంతోపాటు కళాకారులకు పింఛన్‌లు, అటవీ భూమి పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు.

'స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో చట్టవిరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల పోరాటంపై పోలీస్ నిర్బంధాన్ని ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం ఉక్కు కార్మికులపై కక్ష కట్టాయని, కార్మికులను తీవ్రంగా భయపెట్టి, తొలగించి, పోలీస్ నిర్బంధంతో ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల పోరాటంపై ఉక్కుపాదం మోపాయని అన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నా ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవని అన్నారు. టీడీపీ, జనసేన నాయకత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని కోరారు.

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : పాత శ్రీకాకుళంలో మంగళ, బుధవారాల్లో జరగనున్న పెద్దమ్మతల్లి, నూకాలమ్మతల్లి సిరిమాను ఉత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, మళ్లింపు చర్యలు చేపట్టనున్న కారణంగా ప్రజలు సహకరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేశారు.

- పొట్టి శ్రీరాములు కూడలి నుంచి జిల్లా పరిషత్, సంతోషిమాత గుడి, కలెక్టర్ బంగ్లా మీదుగా కునుకుపేటకు వెళ్లేందుకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదు.
- 80 అడుగుల రహదారి, వాంబేకాలనీ మీదుగా కునకుపేటకు వెళ్లేందుకు కూడా వాహనాలకు అనుమతి లేదు.
- కునుకుపేట నుంచి కలెక్టర్ బంగ్లా, సంతోషిమాత గుడి, జిల్లా పరిషత్ మీదుగా పొట్టి శ్రీరాములు జంక్షన్‌కు చేరేందుకు వాహనాలకు అనుమతి లేదు.
- శ్రీకాకుళం పట్టణం నుంచి కునుకుపేటకు వెళ్లాల్సిన వారు 80 అడుగుల రోడ్డు కూడలి, అరసవల్లి, ఖాజీపేట మీదుగా కునుకుపేటకు చేరుకోవాలి.
- వాహనాల పార్కింగ్ నిమిత్తం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద పోలీస్ పెట్రోల్ బంక్ వెనుక భాగం ఖాళీ స్థలం, 80 అడుగుల రోడ్డు మార్గంలో ఎంపీ నివాసం పక్కన ఉన్న ఖాళీ స్థలం, అదే విధంగా ఎ గ్రేబిషన్ పక్కన ఉన్న వాకింగ్ మైదానంలో మాత్రమే వాహనాల పార్కింగ్ చేసుకోవాలి.
- ఈ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు జూన్ 10 మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 12 గంటల వరకు వర్తిస్తాయి.
- జూన్ 11 బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వర్తిస్తాయన్నారు.

కార్పొరేట్‌కే.. షైనింగ్ స్టార్ పట్టం



షైనింగ్ అవార్డులు అందుకున్న విద్యార్థులతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇన్‌చార్జి మంత్రి కె.శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- షైనింగ్ స్టార్ పేరుతో విద్యార్థులకు అవార్డుల అందజేత
- మెజారిటీ విద్యార్థులు కార్పొరేట్/ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన వారే
- కార్పొరేట్‌ను స్వయంగా ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం
- కేంద్రమంత్రి, ఇన్‌చార్జి మంత్రి చేతులమీదుగా పురస్కారాల అందజేత



స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులతో పిరియా విజయ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో కార్పొరేట్ విద్యను స్వయంగా ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. అక్కడ చదువుతూ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు నజరానా అందజేసింది. ఇందుకు తాజాగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుల ఎంపికే ఉదాహరణ. తాజాగా ముగిసిన 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్ల కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. అంతవరకు బాగానే ఉన్నా.. అక్కడే తమ అసలు రంగు బయటపెట్టింది. ఎంపికచేసిన షైనింగ్ స్టార్ల జాబితాలో మెజారిటీ విద్యార్థులు కార్పొరేట్/ప్రైవేటు విద్యాసంస్థల వారే కావడం గమనార్హం.

టెన్త్‌క్లాస్‌లో 178, ఇంటర్‌లో 35 మంది ఎంపిక

జిల్లా నుంచి షైనింగ్ స్టార్ అవార్డులకు పదో తరగతి విద్యార్థులు మొత్తం 178 మంది ఎంపికయ్యారు. ఇందులో వివిధ ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల విద్యార్థులు 93 మంది ఉండగా.. ప్రైవేటు విద్యార్థులే 85 మంది ఉండటం విశేషం. అలాగే ఇంటర్మీడియెట్ నుంచి షైనింగ్ స్టార్ అవార్డులకు మొత్తం 35 మంది ఎంపిక కాగా.. ఇందులో ప్రైవేటు కాలేజీ విద్యార్థులు ఏకంగా 23 మంది ఉండగా, ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కారు విద్యార్థులకే పట్టం

గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిని ప్రోత్సహించాలని టెన్త్‌క్లాస్, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. నాడు పాఠశాల/కళాశాల స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి అంటూ ఐదుస్థాయిల్లో సత్కారాలు చేసి అవార్డులు, రివార్డులు అందజేశారు.

తప్పు పడుతున్న కూటమి నాయకులు..

జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన అవార్డుల పంపిణీకి వచ్చిన టీడీపీ నాయకులను సైతం విద్యార్థుల జాబితా ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానికంగా ఓ సీనియర్ నేత బాహాటంగానే విమర్శలు గుప్పించారు.

తమ చినబాబు చేస్తున్న దుశ్చర్యల కారణంగా ప్రభుత్వ పరువు, ప్రతిష్ట రోజురోజుకీ దిగజారిపోతోందని పక్కన ఉన్న వ్యక్తులతో తన ఆవేదనను వ్యక్తం చేశారు. చినబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై కూటమి పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు.

పురస్కారాలు అందజేసిన కేంద్రమంత్రి, ఇన్‌చార్జి మంత్రి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడుతో కలిసి విద్యార్థులకు రూ.20వేల చొప్పున పురస్కారాలను అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖపై ప్రత్యేకంగా దృష్టిసారించాయని కేంద్రమంత్రి అన్నారు. అంతకుముందు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విద్యార్థులతో ముచ్చటించారు.

అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అంతకుముందు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అతిథులకు వెల్‌కమ్ చెప్పి.. ఆహ్వానించే కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి పంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఆర్డీఓ సాయిప్రత్యూష, ఇంటర్మీడియెట్ విద్య డీఐఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఆర్ఐఓ పి.దుర్గారావు, డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, విజయకుమారి, లియాకత్ ఆలీఖాన్, వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయలోక్ అదాలత్‌లో క్లెయిమ్‌ల పరిష్కారం

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత


ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: మోటార్ ప్రమాద బీమా క్లెయిమ్‌లను జాతీయలోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కోర్టు హాల్‌లో ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, ఈ అదాలత్‌లో మోటార్ ప్రమాద బీమా క్లెయిమ్‌లు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎ. కృష్ణప్రసాద్, వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రాన్ని చూపిస్తున్న విభిన్న ప్రతిభావంతుడు విజయ్‌కుమార్

పార్వతీపురం: విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీహెచ్ విజయ్‌కుమార్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని విభిన్న ప్రతిభావంతులకు వర్తింప జేయాలని కోరారు. సుదూర ప్రాంతాలకు 50 శాతం రాయితీ వర్తింప జేయాలని, ఆర్టీసీలో రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో జీఓ నంబర్ 77 ప్రకారం 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నిర్వహిస్తున్న షాపుల్లో 5శాతం షాపులను విభిన్న ప్రతిభావంతులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కోరారు.

ముగ్గురికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి సరిహద్దు వారి కళ్లాల వద్ద జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు పెదమానాపురం హెడ్ కానిస్టేబుల్ కాశీరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొబ్బిలి నుంచి గజపతినగరం వైపు వెళ్తున్న కారును పెదమానాపురం నుంచి రామభద్రపురం వెళ్తున్న కారు ఢీకొనడంతో రెండు కార్లలో ఉన్న ఆగూరి సంతోషి, పువ్వల రవిబాబు, పువ్వల శాంతమ్మలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ప్రసాద్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు హుండీల ఆదాయాన్ని స్థానిక శివాలయం వీధిలో ఉన్న శ్రీ పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలో సోమవారం లెక్కించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 75 రోజులకు గాను చదురుగుడి హుండీల నుంచి రూ.29 లక్షల 38వేల 935 నగదు, 20 గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారం, 541 గ్రాముల వెండి లభించాయన్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి హుండీల నుంచి రూ.6 లక్షల 92వేల 729 నగదు, 1 గ్రాము.400 మిల్లీ గ్రాముల బంగారం, 49 గ్రాముల వెండి లభించాయన్నారు. వీటితో పాటు అన్నదానానికి సంబంధించి రూ.16వేల12 ఆదాయం ద్వారా లభించిందన్నారు.

పీఆర్, ఆర్డీలో బదిలీలు

సాక్షి, పార్వతీపురం మన్యం: పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ విభాగంలో భారీగా బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్లకు విశాఖ పట్నంలోని డ్వామా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బదిలీ అయింది. ఆయన స్థానంలో డీపీ మల్లికార్జునరావును డీపీఓగా నియమించారు. పార్వతీపురం మన్యం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావును బదిలీ చేస్తూ.. తదుపరి పోస్టింగు కోసం ఆ శాఖ కమిషనర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా పేర్కొన్నారు. ఆయన స్థానంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా విశాఖ నుంచి డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్ (డీడీవో) ఎస్.రవీంద్రను నియమించారు. విజయనగరం డివిజనల్ పంచాయతీ అధికారిగా ఆర్.శిరీషరాణిను నియమించారు. ఇప్పటి వరకూ ఆమె అనకాపల్లిలో పని చేస్తున్నారు. విజయనగరం డ్వామా పీడీ ఇ.సందీప్‌ను అనకాపల్లికి బదిలీ చేశారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీలు పునరావృతం కాకూడదు


వినతులను స్వీకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన దరఖాస్తులు పునరావృతం కాకూడదని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ మందిరంలో జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తిలతో కలిసి ప్రజల నుంచి 44 వినతులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- జియ్యమ్మవలస మండలం అర్నాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నామని, రానున్న వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని, రోడ్డు నిర్మించాలని గ్రామానికి చెందిన ఎం. సురేష్ అర్జీ అందించారు.


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో చిన్నబాబు

- పార్వతీపురం పట్టణంలోని బెలగాంలో హెడ్‌పోస్టాఫీసు వీధిలో చెత్త కుండీ ఏర్పాటు చేయకపోవడం వల్ల నిత్యం పందులు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని గిరి పట్నాయక్ ఫిర్యాదు చేశారు.
- మక్కువ మండలం ఎర్ర సామంతవలస గ్రామానికి చెందిన ఆర్. పార్వతమ్మ సర్వే నంబర్ 101లో భూమిని 20ఏళ్లుగా సాగు చేస్తున్నానని కానీ తన భూమిని వేరేవారు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రికార్డుల ప్రకారం సర్వే చేపట్టి తన భూమి తనకు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరారు.
- పార్వతీపురం మండలం జమ్మిడివలస గ్రామానికి చెందిన అల్లు కుమారి వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి బి.శ్యామల, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎస్. మన్మథరావు, డీపీఓ టి.కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 23 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం ఏపీవో చిన్నబాబు నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 23 వినతులు వచ్చాయి. సీతంపేటలో ఎంపీహెచ్ఏ పోస్టు ఇప్పించాలని జోగైనాయుడుగూడకు చెందిన సవర లక్ష్మణరావు కోరారు. సవర భాష వలంటీర్ పోస్టు ఇప్పించాలని చీడిగూడకు చెందిన సవర బెనర్జీరావు వినతి అందజేశారు. దబ్బగూడకు చెందిన సవర ముసలమ్మ ట్రాక్టర్ లోన్ ఇప్పించాలని కోరింది. మినీ ఫ్లోర్‌మిల్ కావాలని బి.భారతి విన్నవించింది. అంటికొండకు చెందిన నిమ్మక సుందరరావు ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నవి చెల్లించాలని అర్జీ చేశారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, ఏఎంవో కోటిబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

• జేసీ సేతు మాధవన్
• పీజీఆర్ఎస్‌కు 153 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: సమస్యలతో వచ్చి పీజీఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించే అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయనతో పాటు జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, డీపీఓ టి.వెంకటేశ్వర్రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి.శాంతి పాల్గొని వివిధ శాఖలకు సంబంధించి 153 వినతులు స్వీకరించారు.


ఫిర్యాదు దారుల సమస్యలను వింటున్న ఎస్పీ వకుల్ జిందల్

ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు 41 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించి 41ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఫిర్యాదు దారుల ముందే వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ఎస్పీ 41 ఫిర్యాదులను స్వీకరించారు.

విజన్ డాక్యుమెంట్ జిల్లా యూనిట్ ప్రారంభం

విజయనగరం అర్బన్: స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ జిల్లా యూనిట్‌ను రాష్ట్ర హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత కలెక్టరేట్‌లో సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని జిల్లా ముఖ్యప్రణాళిక శాఖ కార్యాలయం వద్ద ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి అమరావతి నుంచి వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలోకలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, జేసీ ఎస్.సేతు మాధవన్, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, సీపీఓ జి.బాలాజీ, జిల్లా అధికారులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2047 నాటికి సాధించాల్సి అభివృద్ధిని ఈ డాక్యుమెంట్లలో పొందుపరిచినట్లు చెప్పారు. అన్ని రంగాల్లో ముందడుగు వేయడానికి ఇలా శ్రీకారం చుట్టామన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో గోల్డ్‌మెడల్


నిర్వాహకుల నుంచి గోల్డ్‌మెడల్ అందుకుంటున్న గౌరునాయుడు

రేగిడి: మండల పరిధిలోని లింగాలవలస గ్రామానికి చెందిన రెడ్డి గౌరునాయుడు జాతీయస్థాయిలో నిర్వహించిన యోగాపోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. కోల్‌కత్తాలో ఈ నెల 6 నుంచి 8 వరకు ఆలిండియా యోగా కల్చర్ ఫౌండేషన్ నిర్వహించిన 35వ జాతీయ ట్రెడిషనల్ యోగాసన చాంపియన్ షిప్-2025లో ఆయన పాల్గొన్నాడు. 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్కులు పాల్గొన్న ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా గౌరునాయుడిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

అనుమతి లేని విద్యాసంస్థల బోర్డులు తొలగించాలి

• ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం


జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన విద్యాసంస్థల బోర్డులను విద్యా శాఖాధికారులు తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకీ, జె.రవికుమార్ మాట్లాడుతూ..మరో 4 నాలుగు రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని, కానీ విద్య పేరుతో వ్యాపారం ముందే మొదలైపోయిందని విమర్శించారు. రాజాం మండలంలో ఉన్న అభ్యాస్ పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేకపోయినా ఇంటర్నేషనల్ అనే బోర్డు ఏర్పాటు చేశారని, ఆ విధంగా తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాజాం మండలంలోనే ఉన్న నారాయణ కార్పొరేట్ పాఠశాలల్లో కూడా ఎటువంటి అనుమతులు లేకుండా ఈ-టెక్నిక్ బోర్డు ఏర్పాటు చేసి ఆ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. విజయనగరం పట్టణంలో గల ఆదిత్య జూనియర్ కళాశాలకు అనుమతులు లేకున్నా, కాకినాడ ఆదిత్య పేరు పెట్టారన్నారు. ఇలా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డుల పేరుతో ఆ విద్యా సంస్థలు పెద్ద ఎత్తున తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. తక్షణమే జిల్లా విద్యా శాఖాధికారులు ఇలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని బోర్డులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జరిగే తాము చేపట్టే ఆందోళనకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జేసీని కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, ఎస్.సమీర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో కార్మికుడి మృతి


కార్మికుడి మృతదేహం

బొబ్బిలి: పట్టణంలోని బెర్రీ ఫెర్రోఎల్లాయీస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుడు మహ్మద్ దిల్‌దార్ అన్సారీ(25) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు సీఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం విధుల్లో భాగంగా మూడో ఫ్లోర్‌లో కేసింగ్ వర్క్ వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

రామభద్రపురం: మండలంలోని అప్పలరాజు పేట గ్రామానికి చెందిన వృద్ధురాలు బాడంగి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బెవర సింహాచలం (65) ఆదివారం మధ్యాహ్నం కడుపునొప్పి తాళలేక గడ్డిమందు తాగేసింది. ఈ విషయం కుటుంబసభ్యులకు తెలియగా వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ దుర్మరణం

బొబ్బిలి: పట్టణంలోని తారక రామా కాలనీకి కొద్ది దూరంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని సాలా లక్ష్మి(56)అనే మహిళ మృతి చెందింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో మృతి చెందిన మహిళను పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం అరసాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తన పెద్ద కుమార్తె, అల్లుడి వద్ద నివసిస్తున్న లక్ష్మి వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఆధార్ కార్డు జిరాక్స్ కోసం వెళ్తుండగా అపార్ట్‌మెంట్‌కు కొద్ది దూరంలోనే మృతి చెందినట్లు ప్రమాద స్థలాన్ని బట్టి తెలుస్తోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ఏ వాహనం ఢీకొందో తెలుసుకోవడానికి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెప్పారు.

జర్నలిస్ట్ వేజ్ బోర్డు చట్టాన్ని పరిరక్షించాలి


నిరసన ప్లకార్డులతో జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్ట్ చట్టాలను పునరుద్ధరిస్తూ వేజ్‌బోర్డు చట్టాల్ని పరిరక్షించాలని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జర్నలిస్టులు నల్లబ్యాడ్జిలు ధరించి స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు కాపాడేందుకు, వేతనాల చెల్లింపులు, ఇతర సదుపాయాలకు వేతన బోర్డులు ఏర్పాటైన 1995, 1998 చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఈ చట్టాల రద్దు వల్ల జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలకు విఘాతం కలగడంతో పాటు వేతన చెల్లింపులకు సంబంధించిన అంశాలు ప్రసావనకు రాకుండా పోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు, మురళి, శంకర్రావు, అప్పారావు, ప్రసాదరావు, గొర్లె సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన

● కూటమి హయాంలో ఎక్కడ చూసినా అరాచకాలు, అఘాయిత్యాలే..
● ఆడబిడ్డలకు రక్షణ కరవు
● తప్పులను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
● అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ అధినేత జగన్, భారతమ్మలపై నిందలు
● మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి



సాక్షి, పార్వతీపురం మన్యం:

కూటమి పాలనలో అరాచకాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని.. వాటిని కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. ఒక నిజాయితీపరుడైన జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం నీచమైన చర్యగా పేర్కొన్నారు. పార్వతీపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఆడబిడ్డలపై దాడులు కనిపించలేదా?

ఒక చర్చావేదికలో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు అడిగిన ప్రశ్నకు.. జర్నలిజం వృత్తిలో ఎంతో అనుభవం ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావు సమాధానమిచ్చారని తెలిపారు. దానిని వైఎస్సార్‌సీపీ పైన.. జగన్, భారతమ్మల మీద ఆపాదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలు సమర్థనీయం కాదని, వాటితో తమకు ఏం సంబంధమూ లేదని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేసిందని.. జరిగిన పొరపాటుకు సదరు జర్నలిస్టులు కూడా క్షమాపణ చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలను కప్పిపుచ్చడానికే లోకేశ్ డైరెక్షన్‌లో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గిరిజన ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య బాధాకరమన్నారు. తన బిడ్డ కనిపించలేదని గత నెల 3న ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత సమీపంలోనే పురుగులు పట్టి, ఆడబిడ్డ మృతదేహం కనిపించిందని.. బీరు సీసాతో దారుణంగా ఆమెను హత్య చేసినట్టు తెలుస్తోందని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని.. వారే సకాలంలో స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదని చెప్పారు. అదే అనంతపురంలో తొమ్మిదో తరగతి చదువుతున్న దళిత విద్యార్థినిపై 14 మంది టీడీపీ కార్యకర్తలు విచక్షణారహితంగా లైగింక దాడికి పాల్పడినా ఏ ఒక్కరూ స్పందించలేదన్నారు. నిందితులు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి పోయిందన్నారు. పట్టపగలే వారికి రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటినీ డైవర్షన్ పాలిటిక్స్ ద్వారా మరుగునపర్చడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

నాడు విజయమ్మ, భారతమ్మల మీద వ్యాఖ్యలు చేయడం తప్పు కాదా?

ఆత్మగౌరవం, మహిళల మనోభావాలంటూ మాట్లాడుతున్న టీడీపీ నాయకులకు.. నాడు విజయమ్మ, జగన్ సతీమణి భారతమ్మలపై నిందలు వేసి, దుర్భాషలాడటం తప్పు అనిపించలేదా?

మహిళాభ్యున్నతికి పాటుపడిందే జగన్..

మహిళాభ్యున్నతి అని గొప్పలు చెప్పుకొంటున్న కూటమి నాయకులు.. వారి కోసం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఏం చేశారని పుష్పశ్రీవాణి ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి మహిళాభ్యున్నతి, సాధికారికత శ్రద్ధ, చిత్తశుద్ధి ఎక్కడ ఉందన్నారు. వెన్నుపోటు తప్ప ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన వీరికి లేదన్నారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళాభ్యున్నతి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. దాదాపు 11 పథకాలు వారి కోసమే అమలు చేశారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం, వలంటీర్లలో 55 శాతం, 13 మంది జిల్లా పరిషత్ అధ్యక్షుల్లో ఏడుగురు మహిళలే అని తెలిపారు. మహిళలకు ఇళ్ల పట్టాలిచ్చి, వారికి ఆర్థిక భరోసానిచ్చారని గుర్తు చేశారు.

అని పుష్పశ్రీవాణి ప్రశ్నించారు. వారూ మహిళలే కదా, వారికి ఆత్మాభిమానం ఉండదా? వారికి ఇప్పుడు క్షమాపణ చెబుతారా? అని నిలదీశారు. 'నాడు మాజీ మంత్రి సుచరితపై అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు.. రోజాపై టీడీపీ నాయకులు బండారు సత్యనారాయణ, చేబ్రోలు కిరణ్ తదితరులు ఎటువంటి వ్యాఖ్యలు చేశారో గుర్తు లేదా? మీ ఐ-టీడీపీలోనే నీచంగా, నిస్సిగ్గుగా వ్యాఖ్యలు చేశారు. ఐ-టీడీపీ చంద్రబాబు, లోకేశ్‌ల కోసం పని చేయడం నిజం కాదా? దానికి బాధ్యత వహిస్తూ వారిద్దరూ క్షమాపణ చెబుతారా?' అని ఆమె ప్రశ్నించారు.

పౌరుల రక్షణ కోసం పోలీసు శాఖ కాదా..

పోలీసు శాఖ ఎవరి కోసం పని చేస్తోందని పుష్పశ్రీవాణి ప్రశ్నించారు. పౌరుల రక్షణ ఆ శాఖ బాధ్యత కాదా? అన్నారు. 'రాష్ట్రంలో మహిళలు, చిన్నపిల్లల మీద అఘాయిత్యాలు పెరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క సమీక్ష అయినా చేశారా? అక్రమ కేసులు, అరెస్టులు.. రెడ్‌బుక్ అమలు.. ఇదే మీకు తెలిసిన పాలన. ప్రశ్నించిన ప్రతి ఒక్కరి మీదా కేసులు పెడతారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోంద'ని తెలిపారు. పోలీసు వ్యవస్థను రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు కోసం కాకుండా.. ప్రజలు, పిల్లల రక్షణ కోసం ఉపయోగించాలని సూచించారు.

జగన్‌ను తిట్టడానికే హోంమంత్రి పదవి

శాంతిభద్రతల పరిరక్షణలో హోంమంత్రి అనిత పూర్తిగా విఫలమయ్యారని పుష్పశ్రీవాణి విమర్శించారు. జగన్‌ను, ఆయన కుటుంబాన్ని తిట్టడానికే ఆ పదవి ఇచ్చినట్లుందని ఎద్దేవా చేశారు. 'సింహాచలం దుర్ఘటనను సమీక్షించింది కూటమి నాయకులు, కార్యక్రమాన్ని నిర్వహించింది వారే.. భక్తులు చనిపోయిన తర్వాత కనీసం క్షమాపణ కూడా చెప్పలేదు. తర్వాత బాధిత కుటుంబాలను పరామర్శించలేద'ని అన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోందన్నారు. మారుమూల జియ్యమ్మవలస, కొమరాడ మండలంలో చిన్నపిల్లల వద్దే దొరుకుతోందని చెప్పారు. గంజాయి వల్లే అఘాయిత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. వంద రోజుల్లో ఈ మాదక ద్రవ్యాన్ని నిర్మూలిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు.. వెయ్యి రోజులైనా ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. గంటకు సుమారు ముగ్గురిపైన.. రోజుకు కనీసం 70 మందిపైన అఘాయిత్యాలు జరుగుతున్నాయని.. ఇది ప్రభుత్వ బాధ్యత కాదా? అని నిలదీశారు. ప్రెస్‌మీట్‌లు, బూతులు మాట్లాడానికే హోం మంత్రి పరిమితమయ్యారన్నారు. ఆడపిల్లల మీద ఇన్ని దుర్ఘటనలు జరుగుతున్నా ఏ రోజైనా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారా? అని ప్రశ్నించారు. కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని.. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని పుష్పశ్రీవాణి అన్నారు.

కార్పొరేట్ల సేవలో ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులను మండలాల వారీగా ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కానీ షైనింగ్ స్టార్ అవార్డుల ఎంపికలో ప్రభుత్వం అవలంబించిన విధానాలను ఉద్దేశించి భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సోమవారం విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి డి.రాము, సీహెచ్ వెంకటేష్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల పేరుతో 20వేల రూపాయల, నగదు, సర్టిఫికెట్, అవార్డుతో సత్కరించింది. సోమవారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులకు ఎంపికైన వారికి అందజేశారు. దీనికి గాను ప్రతి మండలం నుంచి ఓసీకి ఇద్దరు, బీసీకి ఇద్దరు, ఎస్సీ ఒకరు, ఎస్టీ ఒకరిని ఎంపిక చేసి మండలానికి ఆరుగురికి చొప్పున అవార్డులను ఇవ్వనున్నారు. ఈ అవార్డులకు ఎంపికైన ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో 29 మంది ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ఉంటే 17 మంది మాత్రమే ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి ఎంపిక చేసిన వారున్నారు. పాఠశాలలకు సంబంధించి మొత్తం 158మందిలో 65 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచే ఎంపికయ్యారు. ఈ రకమైనే అవార్డులు ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికీ ఒకే ప్రమాణాలు పాటించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నష్టపోయి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా, సిలబస్ పూర్తిగా అవకుండా, అరకొర సౌకర్యాల మధ్య చదువు సాగించి అత్యధిక మార్కులు పొంది న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ షైనింగ్ అవార్డ్స్ ఇవ్వకపోవడం వారి కష్టాన్ని విస్మరించడమేనన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రతి మండలంలో ఓసీ ఇద్దరు, బీసీ ఇద్దరు, ఎస్సీ ఒకరు, ఎస్టీ ఒకరిని చొప్పున ఎంపిక చేయాలి. కానీ విజయనగరం జిల్లాలో ఈ ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. 580 మార్కులు వచ్చిన ఓసీ కేటగిరికి చెందిన ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ఎంపిక చేసి అదే 580 మార్కులు వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నప్పటికీ వెనుకబడిన తరగతుల విద్యార్థిని ఎంపిక చేయకపోవడం సామాజిక బాధ్యతను విస్మరించడం అవుతుందన్నారు. కాబట్టి ఇప్పటికైనా ఈ అవార్డులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు..ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు.